వెంకట్రామయ్య సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావు పేటలో సత్రం స్థాపించి పేద విద్యార్థుల కడుపును నింపిన అళక్కి వెంకట్రామయ్య సేవలు మరువలేని వని పలువురు కొనియాడారు. స్థానిక రామారావుపేటలోని అళక్కి వెంకట్రామయ్య సత్రం వ్యవస్థాపకులు వెంకట్రామయ్య పుట్టినరోజు సందర్భంగా సోమవారం పేదలకు దుప్పట్లు, ఆహార సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. సత్రం ఇఒ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, ఎఫ్ఎఫ్ఎం ఎవిఎస్ఎస్కెజె. శాస్త్రి ఆధ్వర్యంలో వెంకటరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

యువగళం ప్రారంభం

- పాదలాడ నుంచి లోకేష్ యాత్ర
- భారీగా తరలి వచ్చిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి- రాజోలు, మామిడికుదురు, అమలాపురం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్ర మళ్లీ ప్రారంభమైంది. చంద్రబాబు అరెస్ట్ అనంతరం నిలిచిన పాదయాత్ర 79 రోజుల సుదీర్ఘ విరామం అనంతరం సోమవారం రాజోలు మండలం పొదలాడ నుంచి యాత్రను లోకేశ్ ప్రారంభించారు. పాదయాత్ర పున్ణప్రారంభం సందర్భంగా పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు పొదలాడకు చేరుకున్నారు. గతంలో నిర్దేశించిన మార్గంలో కాకుండా ఈ సారి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజోలు, పి.గన్నవరం, అమలాపురం, ముమ్మిడివరం, కాకినాడ నగరం, కాకినాడ గ్రామీణం, పిఠాపురం, తుని నియోజకవర్గాల మీదుగా యాత్ర సాగేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

పాదయాత్రలో భాగంగా రాజోలులోని తాటిపాక సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సంక్షోభాలు, పోరాటాలు టిడిపికి కొత్త కాదన్నారు. 10 ఉమ్మడి జిల్లాల పరిధిలో 2,853 కిలోమీటర్ల మేర ఇప్పటికే పాదయాత్ర చేశానన్నారు. అన్ని రంగాల వారి సమస్యలను తెలుసుకున్నానని తెలిపారు. చంద్రబాబుపై, తనపై వందల కేసులు పెడుతున్నారన్నారు. వాటికి భయపడేది లేదన్నారు. వైసిపి పాలనలో దళితుల మానప్రాణాలకు రక్షణ కరువైందన్నారు. ఎంత మంది ఎస్‌సి బిడ్డలను పొట్టన పెట్టుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జగన్‌కి రెండు బటన్స్ ఉంటాయని,బ్లూ బటన్ నొక్కగానే ఖాతాలో రూ.10 పడుతుందని, రెడ్ బటన్ నొక్కగానే అదే ఖాతా నుంచి రూ. 100 మాయవుతుందన్నారు. విద్యుత్ ఛార్జీలు 9 సార్లు, బస్‌ఛార్జీలు మూడుసార్లు పెంచారన్నారు. చెత్తపై కూడా పన్నులు వేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి అమ్మఒడి ఇస్తా అని చెప్పి జగన్ మోసం చేశాడన్నారు. జాబ్ క్యాలెండర్ జాడే లేదన్నారు. డిఎస్‌సిని పూర్తిగా మరిచారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి మహాశక్తి ప్రకటించారన్నారు. ఈ పథకాలను ఒక్కొక్కటిగా ఆయన వివరించారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ, ప్రయివేటు, స్వయం ఉపాధి ద్వారా 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగ యువతకు యువగళం నిధి కింద నెలకు రూ.3వేలు ఇస్తామని ప్రకటించారు. పెండింగ్ పోస్టులన్ని భర్తీ చేస్తామన్నారు. రైతుల్ని ఆదుకోకపోగా ఇప్పుడు మోటార్లకు మీటర్లు పెడుతున్నారన్నారు. ఆ మీటర్లు రైతులకు ఉరితాళ్లు అన్నారు. మీటర్లు బిగిస్తే పగలగొట్టండి, టిడిపి అండగా ఉంటుందని పిలుపునిచ్చారు. తాము అధికారంలోకొచ్చిన వెంటనే అన్నదాతకు ఏడాదికి రూ.20 వేలు ఇసామన్నారు.

పాదలాడలో లోకేష్ పాదయాత్ర(ఇన్‌సెట్‌లో తాటిపాక సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న లోకేష్

లోకేష్‌కు హారతులు పడుతున్న మహిళలు

వికలాంగునితో మాట్లాడుతూ....

ఒఎన్‌జిసి ప్రమాద బాధితులను ఆదుకుంటాం

యువగలం పాదయాత్రలో పి.గన్నవరం నియోజకవర్గం నగరం గ్రామానికి చెందిన ఒఎన్‌జిసి, గెయిల్ బాధితులు లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. 2014 జూన్ 27న జరిగిన అగ్నిప్రమాదంలో 22 మంది చనిపోయారని, అనేకమంది క్షతగాత్రులయ్యారని తెలిపారు. గెయిల్ యాజమాన్యం బాధితులు, గ్రామస్తులకు అప్పట్లో ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేదని తెలిపారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడారు. ప్రమాదం జరిగిన పదేళ్లయినా ఒఎన్‌జిసి, గెయిల్ అధికారులు ఇప్పటివరకు బాధితులను ఆదుకోకపోవడం దురదృష్టకరమన్నారు. కష్టనష్టాలు ఉన్నప్పటికీ దేశాభివృద్ధి దృష్ట్యా ఇక్కడ ప్రజలు ఒఎన్‌జిసి, గెయిల్ సంస్థలకు సహకారం అందిస్తూ వస్తున్నారు. ప్రమాదం సంభవించినపుడు బాధితులను ఆదుకోవాల్సిన పూర్తి బాధ్యత చమురు సంస్థలదేనన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక పేలుడులో ధ్వంసమైన దేవాలయాలు, ముస్లిం పంజాల స్థానంలో కొత్తవి నిర్మిస్తామని, ఒఎన్‌జిసి, గెయిల్ అధికారులతో మాట్లాడి బాధితులు, నగరం గ్రామస్తులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలుచేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. పాదయాత్రలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, నాయకులు హరీష్‌మాథూర్, నిమ్మకాయల చిన్నరాజప్ప, చిక్కాల రామచంద్రరావు, అయితాబత్తుల ఆనందరావు, రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎస్.లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెఎస్ శ్రీనివాస్, రాజశేఖర్, ఇతర నాయకులు

డిసెంబర్ 4న చలో ఢిల్లీకి తరలి రండి

ప్రజాశక్తి - కాకినాడ

దళిత హక్కులు, సామాజిక న్యాయ సాధనకై ఈ ఏడాది డిసెంబర్ 4న నిర్వహిస్తున్న చలో ఢిల్లీకి వేలాదిగా తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్య భవన్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం సీనియర్ నాయకులు మోర్త రాజశేఖర్ మాట్లా డుతూ డిసెంబర్ 4న దళిత హక్కులు, సామాజిక న్యాయసాధనకై రాష్ట్రపతికి వినతి పత్రం ఇచ్చేందుకు ఢిల్లీలో నిర్వహిస్తున్న మహాధర్నాలో వేలాదిగా ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. దళిత సమస్యల పరిష్కా రానికి రూపొందించిన డిమాండ్స్‌ను ఈసందర్భంగా వివరించారు. భారత రాజ్యాంగానికి ముప్పు తలపెట్టిన బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాదానికి వ్యతిరేకంగా, భారత లౌకిక రాజ్యాంగాన్ని కాపాడు కునేందుకు ఢిల్లీలో దళిత సోషణ ముక్తి మంచ్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, ఇతర దళిత, గిరిజన, యువజన సంఘాలు ఈ కార్య క్రమాన్ని తలపెట్టాయన్నారు. ఈ మహా ధర్నాలో ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణ, దేశంలో యువతీ యువకులకు ఉద్యోగాలు భర్తీ చేయాలని, ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రభుత్వ, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, 41 సిఆర్పీ నోటీసు ఇచ్చే విధానాన్ని ఉపసంహరించుకోవాలని, సబ్ ప్లాన్ చట్టానికి విధించిన కాలపరిమితిని తొలగించి పటిష్ట చట్టం చేయాలని డిమాండ్ చేశారు. చరిత్రను వక్రీకరించే ఆర్ఎస్ఎస్ విద్యా విధానం దేశానికి నష్టమని, యువతలో సనాతన, శాస్త్రీయ భావాలను రుద్దే ప్రయత్నం చేస్తున్న ఆర్ఎస్ఎస్ చర్యలను వ్యతిరేకించి రాజ్యాంగానికి రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, దళిత సంఘాల నాయకులు ఎం.కృష్ణమూర్తి, బచ్చల కామేశ్వరరావు, తుమ్మల నూకరాజు, బయ్య కుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె..సింహాచలం, వ్యవసా య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడీ ఈశ్వరరావు, ఐద్వా రాష్ట్ర నాయకురాలు సిహెచ్ .రమణి, కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఊబ బుల్లబ్బాయి, అదృష్ట దీపుడు, కె.సత్యానందం, పద్మనాభం పాల్గొన్నారు.

డిసెంబర్ 3, 4, 5 తేదీల్లో అగ్రో టెక్ సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ ఏడాది డిసెంబర్ 3, 4, 5 తేదీల్లో గుంటూరు ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రో టెక్ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.వెంకట నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రదర్శన రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ ప్రదర్శనలో నూతన వ్యవసాయ, సాంకేతిక, పలు పంటలకు సంబంధించిన నూతన వంగడాలు, ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు, సాగు పద్ధతులు, సస్య రక్షణ, మార్కెటింగ్, పాడి, చేపలు పెంపకం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఔత్సాహికుల నూతన ఆవిష్కరణలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలు ఉంటాయన్నారు. రైతులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు, రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరంలో ఈ నెల 28, 29 తేదీల్లో తాగునీటి సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్యకుమారి తెలిపారు. స్థానికంగా ఆమె మీడియాతో సోమవారం మాట్లాడారు. నగర ప్రజలు తమతో సహకరించాలని కోరారు. తాగునీరు అవసరమైన వారికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడలకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌కు సంబంధించిన కిట్లను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా కిట్లను పంపిణీ చేశారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి కలెక్టర్ క్రీడాకారుల కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. 15 ఏళ్ళ పైబడిన అన్ని వయస్సుల వారిని క్రీడల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం, ఆనందాన్ని సొంతం చేసుకోవడం, క్రీడా సంస్కృతిని విస్తృతం చేసే దిశగా ప్రభుత్వం అడుగు లేస్తోందన్నారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ దశల్లో క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. పురుషులు, మహిళల కోసం 5 విభాగాల్లో వేర్వేరుగా క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నాను. బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్‌తోపాటు, అన్ని స్థాయిల్లో మూడు అదనపు గేమ్‌లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మారథాన్, యోగా, టెన్నికాయిట్ ఆ ప్రాంతంలోని ప్రసిద్ధ సాంప్రదాయ ఆటలను సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించడం జరుగుతోందన్నారు. క్రీడాకారులు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల నివాసంగా ఉండాలన్నారు. అలాగే వారి ఆధార్ కార్డ్ లేదా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డుతో పోటీలకు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 15 నుంచి గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని, ఈ పోటీలను 2024 ఫిబ్రవరి 3వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్డ్ పోస్టర్‌ను కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. డిఆర్ఒ కె.శ్రీధర్ రెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి.శ్రీనివాస కుమార్, జడ్‌పి సిఇఒ వెంకటరమణారెడ్డి, డిఎం అండ్ హెచ్ఒ జె.నరసింహ నాయక్, డిఇఒ నాగమణి, డిఎల్‌డిఒ పి.నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

ప్రతి ఫిర్యాదునూ పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదును పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల ప్రజల నుంచి ఫోన్ ద్వారా, నేరుగా వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, ప్రజారోగ్యం, ఉద్యాన విభాగాలకు సంబంధించి 18 దరఖాస్తులు అందాయి. వీటిని సత్వరమే పరిష్కరించాల్సిందిగా కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఆర్థికపరమైన, కోర్టు సంబంధ అంశాలు మినహా మిగిలిన సమస్యలను ఎప్పటికప్పుడు నిర్దేశించిన వ్యవధిలో పరిష్కరించి ఆ విషయాన్ని ఫిర్యాదుదారులకు తెలపాలన్నారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలతోపాటు ప్రజా ఫిర్యాదులు స్వీకరించేందుకు టోల్ ఫ్రీ నెంబర్‌ను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోపు టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990కు సమస్యలను వివరించ వచ్చునన్నారు. నగరపాలక సంస్థ ఎస్ఇ పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఇఇలు మాధవి, వెంకటరావు, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వి చరణ్, ఎసిపి నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

వినతిపత్రాలను స్వీకరిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

అవయవదానం ప్రాణ రక్షణకు దోహదం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కోమాలోకి వెళ్లిన వ్యక్తి బతకడం అసాధ్యమని వైద్యులు నిర్ధారిస్తే అలాంటి వారి అవయవాలను ఇతరులకు అమర్చడం ద్వారా వారి ప్రాణాలను కాపాడిన వరు అవుతారని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవాలు అవసరమైన వారు ఎందరో ఉన్నారని, మార్పిడి చేయగల పరిజ్ఞానం కూడా ఉందన్నారు. రెండు మూత్రపిండాలు, కాలేయం, గుండె, ఊపిరితిత్తులు, కళ్ళు తదితర అవయవాలే కాకుండా బోన్ టిష్యు, స్కిన్, కార్నియా వంటి సూక్ష్మ అవయవాలను సేకరించి అవసరమైన వారికి అమర్చ వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, బుద్ధ రాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

జెండాను పీకేసిన గుర్తు తెలియని వ్యక్తులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

వైసిపి జెండా పోల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పీకేసి కాలువలో పడేశారు. మండలంలోని కొత్తపల్లి పాత తహశీల్దార్ కార్యాలయం వద్ద జగన్ మళ్ళీ ఎందుకు రావాలి అనే కార్యక్రమం సందర్భంగా వైసిపి నాయకులు వైసిపి జెండా పోల్‌ను ఏర్పాటు చేశారు. అయితే సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు జెండా పోల్‌ను పీకేసి పక్కనే ఉన్న మురికి కాలువలో పడేశారు. ఇది గమనించిన వైసిపి కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

డ్రయినేజీలో వైసిపి జెండా పోల్

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరంలో మానవీయ వృద్ధుల అనాథ ఆశ్రమంలో రామకృష్ణ అనే వృద్ధుడు మృతి చెందాడు. ఆయన మృతదేహానికి చేయూత సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఎం.రవికుమార్, సెక్రటరీ అలీం మాట్లాడుతూ అనాథగా గత కొన్ని సంవత్సరాలుగా మానవీయ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందిన రామకృష్ణ వృద్ధాప్యం కారణంగా మృతి చెందారని, ఆశ్రమం నిర్వాహకులు ఇచ్చిన సమాచారంతో తమ సంస్థ ఆధ్వర్యంలో ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సాయం చేయడంతోపాటు, పాల్గొన్న సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

అంత్యక్రియలు నిర్వహిస్తున్న చేయూత ప్రతినిధులు

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం శివారు వైఆర్‌సి రోడ్‌లో అగ్ని ప్రమాదానికి తాటాకు ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన కుటుంబానికి సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ అండగా నిలిచారు. బాధిత కుటుంబాన్ని ఆయన సోమవారం పరామర్శించి 25 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు, దుస్తులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వం కోల్పోయిన కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు గుమ్మడి పాదాలమ్మ, కందుల కృపాప్రసాద్, క్రాంతి కుమార్, గిరిజన సంఘం నాయకుడు నాగులపల్లి అర్జున్, మాడెం బాబి పాల్గొన్నారు.

బాధితులకు సరుకులు అందిస్తున్న కోసిరెడ్డి గణేష్

కార్టూ'నిజం'



బర్రెలక్కకు మద్దతుగా కుడుపూడి ప్రచారం

బర్రెలక్కతో కలిసి ప్రచారం చేస్తున్న ఎంసి ఛైర్మన్ శివన్నారాయణ, తదితరులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తెలంగాణ లోని నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ జనరల్ నియోజకవర్గంలో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తున్న దళిత మహిళ కర్నే శిరీష అలియాస్ బర్రెలక్కకు ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ నియోజక వర్గంలోని పెద్ద కొత్తపల్లి మండలం బర్రెలక్క స్వగృహానికి వెళ్లి రూ.35 వేల నగదును అందించారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడారు. పేద దళిత విద్యార్థి ఎన్నికల్లో పోటీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని గెలిపించడానికి ప్రజలందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ఆమెకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. ఆమెతో కలిసి ఇంటింటికీ వెళ్లి బర్రెలక్కకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ధైర్యంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న బర్రెలక్కను ఆయన దుస్సాలువతో సత్కరించి అభినందించారు. ఆయన వెంట పెంకే అర్జున్, జి.సోను, కుడుపూడి శ్రీనివాస్, కోరుకొండ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు పోటెత్తిన యాత్రికులు

అన్నవరం దేవాలయం వద్ద గిరి ప్రదక్షణలో భక్తులు

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి గిరి ప్రదక్షణకు భక్తులు పోటెత్తారు. కార్తీక సోమవారం పురస్కరించుకుని కొండ దిగువన మెట్ల మార్గం వద్ద నుంచి స్వామి పల్లకిలో వేద మరియు మంగళ వాయిద్యాలతో వేలాది భక్తులతో మెయిన్ రోడ్డు, బెండపూడి సరిహద్దు మీదుగా రత్నగిరి కొండ చుట్టూ సుమారు 11 కిలోమీటర్ల వరకు ఈ ప్రదక్షణం జరిగింది. గిరి ప్రదక్షణం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థానం ఏర్పాట్లు చేసింది. పులిహోర, దద్ధోజనం, మజ్జిగ, దాతల సహకారంతో పండ్లు, పాలు వితరణ చేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఒడిశాకు చెందిన రంజాన్ కుమార్‌రౌత్ తండ్రి సివిల్ కాంట్రాక్టర్ కావడంతో హైదరాబాదులో స్థిరపడ్డారు. పందిరి రోహిత్ హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. వీరు బిటెక్ పూర్తి చేశారు. ఇరువురు మంచి స్నేహితులు. రంజన్ కుమార్ తండ్రి అన్నవరంలో సివిల్ పనులు నిర్వహిస్తున్నాడు. వాటిని చూసేందుకు స్నేహితులిద్దరూ ఆదివారం రాత్రి హైదరాబాద్లో ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. సోమవారం ఉదయం 7:30 సమయంలో గోపాలపురంలో నేషనల్ హైవేకి చేరుకున్నారు. కరిచర్లగూడెం సమీపంలో గోపాలపురం వైపు వచ్చేసరికి విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రంజన్ కుమార్‌రౌత్(24) అక్కడికక్కడే మృతి చెందాడు. రోహిత్ తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది రోహిత్‌ను సిహెచ్‌సికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రోహిత్(24)మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ పరిశీలించారు. మృతదేహాలను దేహాలను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎస్పి పి.జగదీష్ ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను ఎస్ఐ సతీష్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. హైవే మొబైల్ వాహనాన్ని ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. హైవేపై ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి తగిన జాగ్రత్తలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - పెద్దాపురం

తాళాలు వేసి ఉన్న ఇంటిలో సోమవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇంటిలో అన్ని వస్తువులు, దుస్తులు దగ్ధం అయ్యాయి. స్థానిక శోభా థియేటర్ సమీపానికి చెందిన పాత్రికేయుడు, ఇంటి యజమాని విల్సన్ రాయ్, ఆయన భార్య అంగన్‌వాడీ కార్యకర్త ప్రియా రంజనీలు ఇంటిలో లేని సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో వారు కట్టుబట్టలతో మిగిలారు. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే అగ్నిమాపక అధికారి శ్రీహరి జగన్నాథ్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ.5 లక్షలు ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని బాధితులు తెలిపారు. ఈ ప్రమాదం వార్త తెలిసిన వెంటనే జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మల బాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పెదిరెడ్ల పద్మావతి, జాగారపు సూర్య కుమారి, మేరీ కుమారి, ప్రవీణ, బేబీ కుమారి, సిఐటియు నాయకులు నీలపాల సూరిబాబు, తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అగ్నిప్రమాదంలో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి -ఐ.పోలవరం

మండలంలోని కొమరగిరి పంచాయితీ లైన్‌పేటలో తాటాకిల్లు దగ్ధమై ఆ ఇంటిలో ఉన్న వృద్ధురాలు మరణించిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకంది. గ్రామానికి చెందిన నాగాబత్తుల వెంకాయమ్మ(80) తన తాటాకింటిలో నిద్రిస్తున్న సమయంలో కిరోసిన్ దీపం అంటుకొని ఇల్లు దగ్ధమయ్యింది. చుట్టుప్రక్కల వారు గమనించి అగ్నిమాపక సిబ్బంది సాయంతో మంటలను అదుపు చేశారు. అప్పటికే ఆమె మరణించింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఐ.పోలవరం ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు.

ఎసిబికి చిక్కిన డిటి, విఆర్ఒ

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండల డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఒ రూ.23 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కారు. మండలంలోని సోమరాయణంపేటకు చెందిన రైతు బుద్ధ జయ ఆదినారాయణ లాండ్ రికార్డ్ పని చేసేందుకు మండల డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, విఆర్ఒ వై.లక్ష్మీదేవి రూ.23 వేలను డిమాండ్ చేశారు. దీంతో ఆ రైతు ఎసిబి అడిషనల్ ఎస్పి సౌజన్యను సంప్రదించారు. ఎసిబి అధికారులు వేసిన వలలో వారిద్దరూ సోమవారం చిక్కారు. పాలెం గ్రామంలో రూ.23 వేల లంచాన్ని తీసుకుంటుండగా వారిద్దరినీ ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

పారిశుధ్య కార్మికునికి పాము కాటు

ప్రజాశక్తి - గోపాలపురం

తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన చాకర్ల జయరాజు అదే పంచాయతీలో పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా చెత్తను తొలగించే క్రమంలో కలిపై తాచుపాము కాటుకు గురయ్యాడు. వెంటనే అతన్ని గ్రామంలో పిహెచ్‌సికి తరలించారు. అక్కడ యాంటీ వీనం ఇచ్చి మెరుగైన వైద్యం కోసం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. డాక్టర్ చైతన్యరాజు వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన తెలిపారు.

ఒక్కరోజు ఆదాయం రూ.1.50 కోట్లు

ప్రజాశక్తి - అన్నవరం

కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి వారికి వివిధ సేవా టిక్కెట్లు దర్శనాల ద్వారా ఒక్కరోజే రూ.1. 50 కోట్లు ఆదాయం లభించింది. కార్తీక సోమవారం పౌర్ణమి రావడంతో ఆదివారం సాయంత్రం నుంచి రత్నగిరి కొండకు వేల సంఖ్యలో భక్తులు చేరుకున్నారు అందుకు తగ్గట్టుగా దేవస్థానం అధికారులు సోమవారం ఒంటిగంట నుంచే వ్రతాలు, రెండు గంటల నుంచి దర్శనాలు ఏర్పాటు చేయడంతో సాయంత్రానికి 15, 640 వ్రతాలు, 40 నిత్య కళ్యాణాలు జరిగాయి. సుమారు రెండు లక్షల ప్రసాదం ప్యాకెట్లు విక్రయం జరిగాయి. మొత్తం వీటన్నింటి ద్వారా రూ.1.50 కోట్లు ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఇఒ రామచంద్ర మోహన్ తెలిపారు. ఛైర్మన్ ఐవి రోహిత్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబులు క్షేత్రస్థాయిలో తిరిగి ఆయా ప్రదేశాల వద్ద సిబ్బందిని అప్రమత్తం చేశారు.

విజయవంతంగా కార్మిక, కర్షక పోరాటం

ప్రజాశక్తి - కాకినాడ

మహాధర్నాలో పాల్గొన్న కాకినాడ ప్రతినిధులు

నవంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో జరుగుతున్న 36 గంటల మహాధర్నా విజయవంతంగా జరుగుతుందని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వ శేషాబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మోడీని గద్దెదించండి, దేశాన్ని కాపాడండి అనే నినాదంతో దేశవ్యాపితంగా 13 కేంద్ర కార్మికసంఘాలు, 580 రైతు సంఘాలు ఉమ్మడిగా ఇచ్చిన పిలుపు మేరకు జరుగుతున్న మహాధర్నాలో మోడీ, జగన్ జోడీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేఖ విధానాలను తప్పుపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుబండి చంద్రావతి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, ఎపి బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, సిఐటియు నగర అధ్యక్షులు పలివేల వీరబాబు, జిల్లా కోశాధికారి మలకా రమణ, లలిత, రాజేశ్వరి, నాగమణి, మున్సిపల్ కార్మికులు, అర్బన్ హెల్త్ ఉద్యోగులు, పంచాయితీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు జిల్లా నుండి పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పేదరికం పోవాలంటే జగన్ సిఎం అవ్వాలి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

ఇంటింటా ప్రచారం చేస్తున్న బండారు రాజా, ఇతర నాయకులు

సమాజంలో పేదరికం రూపు మాపాలంటే మరోమారు జగన్మోహన్ రెడ్డిని సిఎం కావాల్సిన అవసరం ఉదని మండల సచివాలయల కన్వీనర్ బండారు రాజా అన్నారు. సోమవారం మండల కేంద్రమైన జగ్గంపేట సచివాలయం 1 పరిధిలో రాష్ట్రానికి జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో వైఎస్ఆర్ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో పాదయాత్ర చేశారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. పేదల సిఎంగా జగన్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని, పేద ప్రజల మేలు కోరి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గణేష్ బాబు, సచివాలయం కన్వీనర్లు రెడ్డి భాను, చిత్తిమాని సత్యనారాయణ, వీధి శ్రీను, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కాపావరపు వెంకటరమణ, పార్టీ నాయకులు జి.సోమసుందర్, బుర్ర కన్నారావు, రంబాల ప్రకాష్, కాపవరాపు సతీష్ పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మానవ జీవరాశి తొలినాళ్లనుంచి నేటి వరకూ పరోపకారమనే ఉన్నత భావనతోనే గణనీయంగా వృద్ధి చెందిందని, ఎంత దానం చేస్తే అంతగా సంపన్నులవుతామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ అన్నారు. సర్పవరం జంక్షన్‌లో బసవరాజు సౌజన్యంతో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరికి చేసిన ఉపకారమే మనిషికి మిగిలే నిజమైన సిరి అన్నారు. ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవ రావు, రాజా, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వర ఆలయం కిటకిట

ప్రజాశక్తి - సామర్లకోట

ఆలయంలో క్యూలైన్లో ఉన్న భక్తులు

పంచారామ క్షేత్రమైన సామర్లకోట శ్రీ కుమారస్వామి భీమేశ్వ రాలయం రెండో కార్తీక సోమవారం యాత్రికులతో కిటకిట లాడింది. తెల్లవారుజాము 4:30 గంటలకు ఆలయంలో గోపూజ, మహాగణపతి పూజ, నిర్వహించి భీమేశ్వర స్వామికి పంచామతాభిషేకాలను ఆలయ పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలిపూజల అనంతరం దర్శనం కోసం భక్తులు క్యూ లైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. బాలా త్రిపుర సుందరి అమ్మవారికి లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ప్రత్యేక సేవలను అందించారు. ఆలయం వద్ద భద్రతా చర్యల్లో భాగంగా స్థానిక సిఐ సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తును నిర్వహించారు.

ప్రముఖుల పూజలు

కార్తీక సోమవారం ప్రముఖులు తరలివచ్చి పూజలు చేపట్టారు. రాష్ట్ర సమాచార కమిషనర్ ఇల్లపురం రాజా ఆలయానికి విచ్చేసి పూజలు చేపట్టారు. ఆయనకు దేవదాయ శాఖ అధికారిణి దుర్గా భవానీ ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు.ఆయన వెంట సామర్లకోట తహశీల్దార్ లక్ష్మీ నరస కుమారి ఉన్నారు. ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు కుటుంబ సమేతంగా వచ్చి పూజలు చేపట్టారు. పలువురు హైకోర్టు, జిల్లా జడ్జీలు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వైసిపి నాయకులు దవులూరి సుబ్బారావు ఆలయ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన జ్వాలా తోరణాన్ని ప్రారంభించారు.

నాగేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఆర్థిక సాయాన్ని అందిస్తున్న వైద్యులు

వాగతిప్ప గ్రామానికి చెందిన పిఎంపి డాక్టర్ ద్రాక్షారపు నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు. దీంతో మండలంలో పిఎంపి వైద్యులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.7 వేలను సాయం అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పిఎంసి అధ్యక్షులు దాసరి ప్రసాద్, జానరాజు, ఎం.జగన్, మసకపల్లి రాజు పాల్గొన్నారు.

గ్రామ సభ నేటికి వాయిదా

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని జగపతినగరం పంచాయితీ ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభ నేటికి వాయిదా పడింది. సామాజిక తనిఖీల్లో అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఏర్పాటు చేసిన గ్రామసభలో గతంలో పనిచేసిన అధికారులు కూడా గ్రామ సభకు రావాలని గ్రామ ప్రజలు, స్థానిక సర్పంచ్, వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. దీంతో సామాజిక తనిఖీ అధికారి డేవిడ్ రాజు ఎంపిడిఒ, ఇతర అధికారులతో నిర్వహించేలా సభను నేటికి వాయిదా వేశారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - కిర్లంపూడి

సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొడితే కొట్టాలి సానా సతీష్ బాబు క్రికెట్ చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలకు బహుమతులు సోమవారం పంపిణీ చేశారు. జగ్గంపేట నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో ఏడు జట్లు పాల్గొనగా కృష్ణవరం జట్టు విన్నర్‌గానూ, కిర్లంపూడి జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలకు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబి పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిర్లంపూడిలో కొడితే కొట్టాలి సానా సతీష్ బాబు చాంపియన్ షిప్ క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడా పోటీలనే కాకుండా, పలు సేవా కార్యక్రమాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం హర్షనీయమన్నారు. సానా సతీష్‌బాబు చేస్తున్న సేవా కారక్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాపేటి ప్రసాద్, యల్లపు శివ, సిగటాపు కృష్ణరావు, పాముల వీరబాబు, శరకణం సూరిబాబు, కాళ్ళ పోలారావు, కరణం లోవ కుమార్, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

సాగులో ఉన్నవారికే పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

రిలే దీక్ష చేస్తున్న బాధితులు

గుర్రప్పాలెంలో ఉన్న సీలింగ్ భూములను సాగుదారుల పేరుపై పట్టాలు ఇవ్వాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సీలింగ్ భూమి సాగుదారులు సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రప్పాలెం దళితులు సాగుచేసుకుంటున్న సీలింగ్ భూముల సమస్యపై ఏడాది కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నామని తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందనలోనూ ఫిర్యాదు చేశామని, అయినా నేటికీ ఆ సమస్యకు పరిష్కారం లభించలేదని అన్నారు. ప్రస్తుతం ఆ భూమిని ఎంఎల్ఎ అనుచరులకు కట్టబట్టేందుకు వీలుగా తప్పుడు సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి స్థానిక తహశీల్దార్ అందిస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. దళిత బలహీన వర్గ ప్రజల పార్టీ అని చెప్పుకుంటున్న వైసిపి పాలనలో దళితులు సాగుచేసుకుంటున్న భూములను లాక్కునే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. తక్షణమే జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని స్వయంగా గుర్రప్పాలెం గ్రామంలో విచారణ చేపట్టి, తప్పుడు సమాచారం ఇస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. . ఈ కార్యక్రమంలో ఎపి ఆర్‌సిఎస్ జిల్లా కార్యదర్శి బి రమేష్, ఎఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కుంచే అంజిబాబు, పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు

ప్రజాశక్తి - కాకినాడ

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిపై ఉందని కాకినాడ సిటీ నియోజకవర్గ ఇఆర్ఒ, కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు అన్నారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో సోమవారం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై బిఎల్ఒలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన ప్రతి ఒక్క దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండే యువత కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ సమావేశంలో ఇఆర్ఒలు కోన శ్రీనివాస్, సీతాపతి, మురళీకృష్ణ, నాగశాస్త్రులు, జాన్ బాబు, వరహాల బాబు తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్ల విజయవంతం

ప్రజాశక్తి - యానాం

కంటి వైద్య శిబిరంలో గుర్తించిన 14 మందికి జగ్గంపేట ఆసుపత్రిలో ఆపరేషన్లు పూర్తి చేసి సోమవారం యానాంకు తీసుకొచ్చినట్లు లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ అధ్యక్షులు పులవర్తి శ్రీను తెలిపారు. ఈ నెల 25న ఎంఎల్ఎ అశోక్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ, ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ(హైదరాబాద్) అనుబంధ సంస్థ రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ వైద్యశాల సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. ఆ శిబిరంలో 14 మందికి ఆపరేషన్లు పడతాయని వైద్యులు గుర్తించారు. దీంతో వారిని జగ్గంపేట తీసుకెళ్లి ఆపరేషన్లు చేయించినట్లు శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ నిర్వాహకులను అభినందించారు.

అధికారుల పేర్లు మార్చేది ఎప్పుడో..?

ప్రజాశక్తి - రౌతులపూడి

అధికారులు బదిలీపై వెళ్లిపోయి నెలలు, సంవత్సరాలు గడుస్తున్నాయి. వారి స్థానంలో ఇతర అధికారులు వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే స్థానిక అధికారులకు మాత్రం వారి స్థానంలో మరోకరు వచ్చారన్నా స్పహ ఉండటం లేదు. ఇందుకు ఉదాహరణే రౌతులపూడి ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలో ఉన్న బోర్డు. వసతి గృహంలో మన రాష్ట్రానికి సంబంధించి గవర్నర్‌తోపాటు, ఇతర ఉన్నతాధికారుల పేర్లు విద్యార్థులకు తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న గవర్నర్ స్థానంలో మరోకరు కొత్తగా నియమితులయ్యారు. ఆయన వచ్చి సుమారు ఏడాది కాలం అవుతోంది. అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఎస్‌పిలు కొత్తగా మారారు. అయితే ఇక్కడ ఏర్పాటు చేసిన బోర్డులో నేటికీ ప్రస్తుతం గవర్నర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఎస్‌పిల పేర్లను సైతం మార్చకపోవడం విశేషం.

దళితుల హక్కుల సాధన కోసమే చలో ఢిల్లీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

దళితుల సామాజిక ఆర్థిక హక్కుల సాధనకై డిసెంబర్ 4 చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు,కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ సభ్యుడు విప్పర్తి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానికంగా చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు గడుస్తున్నా నేటికీ దళితుల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. నేటికీ అనేక సమస్యను వారు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డిమాండ్స్ సాధన కోసం డిసెంబర్ 4న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అత్తిలి బాబురావు, పులుపకూర గోపాలకృష్ణ, మందనక్క తణుకు రాజు, దుప్పి అదృష్టదీపుడు పాల్గొన్నారు.

ప్రతిభను చాటిన యండమూరి విద్యార్థులు

ప్రజాశక్తి - కరప

కాకినాడ జెఎన్‌టియులో క్రియా పిల్లల పండుగలో యండమూరి పాఠశాలలోని విద్యార్థిణులు పలు అంశాల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చారని హెచ్ఎం ఎస్.సరస్వతి తెలిపారు. ఈ నెల 25, 26 తేదీల్లో జరిగిన క్రియా ఉత్సవంలో రాష్ట్రస్థాయిలో 400 స్కూల్స్ నుంచి 4 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. యండమూరులో 4వ తరగతి చదువుతున్న పలివెల హన్సిక నృత్య ప్రదర్శనలో కూచిపూడి, భరతనాట్యంలో విశేష ప్రతిభ కనబరిచి మెమెంటోను అందుకున్నట్లు తెలిపారు. ఈ పాఠశాల నుంచి ఏడు విభాగాల్లో 25 మంది బహుమతులు సాధించారన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు బి.పద్మావతి, విద్యార్థులను ఎంఇఒలు బికె.కృష్ణవేణి, పిఎస్ఎన్, ఉపాధ్యాయులు అభినందించారు.

పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మహిళల్లో రక్తహీనత అధికంగా ఉంటుందని, కావున పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా నివారించవచ్చునని పోషకాహార నిపుణురాలు మల్లీశ్వరి అన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రుతి స్రావం, ప్రసవ సమయంలో రక్తం నష్టం ఎక్కువగా ఉంటుందని, వాటివల్ల రక్తహీనత భారిన మహిళలు పడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు, రాజా, మోహిని కుమారి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

29న పెద్దాపురం కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎజెండాలోని 16 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఉద్యోగులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

రమేష్ రాజాకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విద్యా సంస్థలకు చెందిన ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాల ఇసిఇ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న ఇనకోటి రమేష్ రాజా డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన "జెఎస్ యూనివర్శిటీ శికోహబాద్" నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (డాక్టరేట్) పొందినట్లు తెలిపారు. డాక్టర్ రామిరెడ్డి.గంగాధర్ రెడ్డి నేతత్వంలో రమేష్ రాజా సమర్పించిన శీర్షిక "ఎఫిసెంట్ డ్డేటాడెలివరీ ఇన్ 5జి మొబైల్ కమ్యూనికేషన్ నెట్ వర్క్స్" అనే అంశంపై థీసిస్ సమర్పించడంతో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్. సతీష్ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్. డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపల్. డాక్టర్ డోలా సంజయ్ అభినందించారు.

మహారాజశ్రీ ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 120/2022
Between:
శ్రీమతి పెనుమాల లక్ష్మి నరసు -వాది
AND
పెనుమాల నరసింహారావు అండ్ అదర్స్ -ప్రతివాదులు
To:
D-1: పెనుమాల నరసింహారావు, తండ్రి: లక్ష్మణస్వామి, H.No. 302, ఇంద్రప్రస్థ అపార్ట్‌మెంట్స్, వాకలపూడి, కాకినాడ, కాకినాడ రూరల్ మండలం.
ఈ పై నెంబర్ దావాను వాది మీ పై మీరు వ్రాయించి ఇచ్చిన తనఖా బాకీ అసలు ఫాయిదాలు తాలూకు వసూలు మున్నగు పరిహారములు కోరుచూ దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు సమన్సు నిమిత్తం మరియు మీ హాజరు నిమిత్తం వాయిదా ది. **08-12-2023వ తేదీ** అయి వున్నది. కావున మీరు వాయిదా రోజున **ఉదయం 10.30 గం।। ని।।లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ వారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. అట్లు కాని యెడల మీ పరోక్షమందున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
శ్రీ గుత్తుల శ్రీనివాసరావు
అడ్వకేట్స్, ముమ్మిడివరం
ముమ్మిడివరం సెల్: 9440041751
ది.18-11-2023 సెల్:9440528135

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 23/2023
O.S. No. 64/2014
Between:
M/s. NSL Krishna Veni Sugars Ltd., Ramakrishnapur Village, rep. by its Authorised Person, N.Bhaskara Rao ...DHr
AND
1. Ch.Varahalu, S/o. Sathibabu, age 30 years, Agriculture & Business,.
2. Gudubelli Lova Raju, S/o. Veera Swamy, age 40 yrs, (Both are R/o. Koduru (V), Rowthulapudi (M), Kakinada Dist., ...JDrs
పై నెంబరు E.P. లో 1 & 2 JDrs నకు డిక్రీ హోల్డరు ఎన్నిసార్లు నోటీసులు పంపించినను 1 & 2 JDrs వాటిని ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక త్రిప్పివేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి అనుమతితో ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియచేయునది ఏమనగా, **ది. 28-11-2023వ తేదీన ఉదయం గం।। 10.30 ని।।లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి ఆక్షేపణలు ఏమైనా ఉన్న యెడల స్వయముగా గానీ, అడ్వకేట్ గారి ద్వారా గాని తెలియచేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించెదరు.
పి.రాజు, అడ్వకేట్
పిఠాపురం, సెల్: 9866857216

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 28/2023 in
O.S. No. 48/2014
Between:
M/s. NSL Krishna Veni Sugars Ltd., Ramakrishnapur Village, rep. by its Authorised Person, N.Bhaskara Rao ...DHr
AND
B.Arjuna Rao and 2 Others ...JDrs
JDr No-2:
L.Thrimurthulu, S/o. not known, Major, Agriculture & Business, R/o. Pathakottam Village, Kotananduru Mandal, Kakinada District.
పై నెంబరు E.P. లో 2వ JDr నకు డిక్రీ హోల్డరు ఎన్నిసార్లు నోటీసులు పంపించినను 2వ JDr వాటిని ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక త్రిప్పివేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి అనుమతితో ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియచేయునది ఏమనగా, **ది. 28-11-2023వ తేదీన ఉదయం గం।। 10.30 ని।।లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి ఆక్షేపణలు ఏమైనా ఉన్న యెడల స్వయముగా గానీ, అడ్వకేట్ గారి ద్వారా గాని తెలియచేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించెదరు.
పి.రాజు, అడ్వకేట్
పిఠాపురం, సెల్: 9866857216

మహారాజశ్రీ కాకినాడ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 410/2023
Between:
ఐతే గుర్రయ్య -వాది
మరియు
ఇసరపు దుర్గారావు -ప్రతివాది
To:
ఇసరపు దుర్గారావు, వయస్సు 41 సం।।లు, S/o. పెంటయ్య, మున్సిపల్ ఉద్యోగి, R/o. డో.నెం. 16-33-65, సాంబమూర్తి నగర్, జ్యోతుల కాలనీ, కృష్ణుని గుడి దగ్గర, కాకినాడ, కాకినాడ జిల్లా. -ప్రతివాది
పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనకుండగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 18-12-2023వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం।। 10.30 ని।।లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును అని ఇందుమూలంగా తీర్మానించబడును.
యనమల రామం
కాకినాడ అడ్వకేట్, కాకినాడ
20-11-23 సెల్: 9848442583

IN THE COURT OF THE 3RD ADDL. DISTRICT JUDGE : KAKINADA
I.A. No. 436/2020
A.S.S.R. 1256/2020
Between :
SALADI TIRUPATHI VENAKTA SATYA SURYA PRAKASA RAO,
S/o. Veeraswamy, Hindu, Aged 58 Years, R/o. D.No. 76-4-32/4, Flat No. C2, Krishna Sai Apartments, Gandhipuram - 2, Rajahmundry. ...Petitioner / Appellant
and
SUNKARA PALLAM RAJU,
S/o. Veera Venkata Satyanarayana, Aged 38 Years, R/o. D.No. 17-1-46/1, Parlovapeta, Kakinada.
...Respondent / Plaintiff
పై నెంబరు పిటీషనులో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు / సమన్లు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం **ది. 05-12-2023వ** తేదీకి వాయిదా వేసినారు. ఆ రోజు **ఉదయం గం. 10-30 ని।।లకు** పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ వకీలు గారి ద్వారా గానీ హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)
M.R. SHARIEF
P. SATISH KUMAR
N. SATYANARAYANA
Advocates
#12-2-25, Dantuvari Street,
KAKINADA. Cell: 9948666679

మహారాజశ్రీ రాజమండ్రి 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 378/2023 in
O.S. 380/2016
Between:
దాసరి నానాజీ
-పిటీషనర్ (4వ ప్రతివాది)
మరియు
తోట శ్రీనివాసరావు వగైరాలు
To:
R-3: కాట్రాడ సీతారామ వెంకట సత్య నాగలక్ష్మి విజయకుమారి, W/o. కొల్లపర్తి వీర రాఘవులు, డో.నెం. 1-28, పొన్నమండ విలేజ్, రాజోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా.
R-4: కాలెపు సత్య మురళీధర్, S/o. మోహన్‌కృష్ణ, డో.నెం. 49-2-69, సుబ్బారావుపేట, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా.
నోటీసు
సదరు పై నెంబర్లు గల పిటీషన్లలో మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపించిను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. దీని కారణంగా శ్రీ కోర్టు వారు మీకు నోటీసులు ప్రజాశక్తి పత్రికలో ప్రచురించుటకు ఉత్తర్వులు జారీ చేసినారు. మీకు నోటీసు ప్రజాశక్తి పత్రికలో ప్రచురించి పై పిటిషన్ **ది. 4-12-2023 సంవత్సరం తేదీన** వాయిదా అయివున్నదని, సదరు వాయిదాకు మీరు కోర్టుకు **ఉదయం గం।। 10.30 ని।।లకు** మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియచేయవలసిందిగా ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది. సదరు వాయిదా రోజున మీరు కోర్టుకి హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.
రాజమండ్రి **కె.వెంకట్రావు**
25-11-2023 **కె.శ్రీరామ మనోహర్**
పిటిషనరు (4వ ప్రతివాది) తరపు న్యాయవాదులు
సెల్: 9440254625

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కొవ్వూరు
E.A. No. 13/2023
E.P. No. 164/2010
O.S. No. 115/2005
Between:
చంద్రు వీర వెంకట సత్యన్నారాయణ
-పిటీషనరు/ DHr
AND
1) మారెడ్డి వెంకట సత్యవతి (Since died)
2) మారెడ్డి సత్యన్నారాయణ (died)
3) మారెడ్డి త్రినాధ అప్పారావు
4) మారెడ్డి వినీల
-రెస్పాండెంట్లు/ JDr's & 3 & 4 Proposed Legal Representaives of 1st JDr
To:
మారెడ్డి వినీల, D/o. సత్యన్నారాయణ, హిందు, వయస్సు 35 సం।।లు, అవివాహిత, R/o. భీమోలు గ్రామం, గోపాలపురం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
ప్రకటన
పై నెంబరు E.P గ్రంథములో మొదటి JDr చనిపోయినందున మిమ్మల్ని మారెడ్డి వెంకట సత్యవతి వారసులుగా చేర్చమనీ కోరుతూ దాఖలు చేసిన పై నెంబరు పిటీషనులో 4వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా, రిజిష్టర్ పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనకుండా బుద్ధిపూర్వకముగా Avoid చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా పై పిటీషను E.A. No. 13/2023 in E.P. No. 164/2010 in O.S. No. 115/2005 లో మీ హాజరు నిమిత్తం **ది. 8-12-2023 సం।।** తేదీనకు వాయిదా అయివున్నదని, పై పిటీషనులో మీకు ఏమైనా ఆక్షేపణలున్న యెడల పై కోర్టులో పై **తేదీన ఉదయం 10.30 ని।।ల** లగాయితూ స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు శ్రీ కోర్టు వారు పై పిటీషనును తీర్మానించుదురనీ యిందుమూలముగా తెలియపర్చడమైనది.
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
సిహెచ్.వెంకటేశ్వరరావు
సిహెచ్.దత్తకృష్ణ నిఖిత్
కొవ్వూరు పిటిషనరు తరుపు అడ్వకేట్లు
21-11-2023 రాజమండ్రి